

బొమ్మకల్ ఉప సర్పంచ్ ఇస్తియాక్ అహ్మద్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల



కరీంనగర్‌రూరల్: యువకుడికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

# బీఆర్‌ఎస్‌తోనే యువతకు భవిష్యత్

- పార్టీ కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళలతో మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 1: కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. బుధవారం రాత్రి మంత్రి నివాసంలో నగరంలోని పలు డివిజన్లకు చెందిన మహిళలు మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే, నగరానికి చెందిన 30 మందికి పైగా యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్‌తోనే యువతకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకపోతే ఈ స్థాయిలో అభివృద్ధి జరిగేదా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో తప్పు చేస్తే యువత భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తప్పుడు ప్రచారాలను నమ్మితే తెలంగాణ మళ్లీ ఆంధ్రాలో కలిపి ఇక్కడి నీళ్లు, కరెంటు, హైదరాబాద్ సంపదను దోచుకుపోతారని హెచ్చరించారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచి గెలిపించాలన్నారు. తనను మరోసారి గెలిపిస్తే రెట్టింపు ఉత్సాహంతో పని చేసి నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన వనజ, లక్ష్మి, అమర్, సంజీవ్, అనంద్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన బొమ్మకల్ ఉపసర్పంచ్

కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ ఉప సర్పంచ్ ఇస్తియాక్ అహ్మద్ బుధవారం రాత్రి మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. స్థానిక రజ్వీచమన్‌లోని ఎస్‌ఎఫ్ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటుగా పలువురు ముస్లిం యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ పాలనలోనే మైనార్టీల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జమీలొద్దీన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు

కరీంనగర్ రూరల్, నవంబర్ 1: పల్లెల్లో జరిగిన అభివృద్ధిని చూసి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగునూర్ గ్రామంలో మున్నూరుకాపు, ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో అత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల్లోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యువకులు గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, ఎంపీటీసీలు వినయ్, శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ సాయిల మహేందర్, పిట్టల రవీందర్, పప్పు లచ్చయ్య, సొసైటీ అధ్యక్షుడు నూనె రాజేశం, మల్లేశం, రాజు, కొముర‌య్య, తాటికొండ మధుకర్, మున్నూరుకాపు సంఘం నాయకులు వరి భద్రయ్య, తోట సత్యనారాయణ, మామిడి అదిరెడ్డి, సంజీవ్, వరి శంకరయ్య, కస్తూరి శ్రీనివాస్ రెడ్డి, నెక్‌పాషా, బాబు, పెంచాల శ్రీనివాస్‌రావు, రవితేజ, లక్ష్మారెడ్డి, శ్రావన్, శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాలపై కేంద్రం కుట్రలు



మాట్లాడుతున్న ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం

- ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం

తెలంగాణచౌక్, నవంబర్ 1: దేశంలో అణగారిన వర్గాలను అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం ఆరోపించారు. నగరంలో బుధవారం ఆయన ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, కుల సంఘాల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి దేశ ప్రజల మధ్య విభేదాలను సృష్టిస్తున్నదని మండిపడ్డారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అణిచివేయడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా చేస్తున్న కుట్రలను ప్రజలకు తెలియజేయడానికే ఈనెల 4న అంబేద్కర్ స్టేడియంలో తెలంగాణ ప్రజా గర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా గర్జన సభకు ఎంఐఎం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. కుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, నాయకులు ఆనందరావు, లత, సంజీవ్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి



నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

చొప్పదండి, నవంబర్ 1: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలోని ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు స్వీకరించే రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో మార్కింగ్ చేయాలని, ఆ పరిధిలో ఉన్న దుకాణాలు మూసివేయించాలని, ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ వేసేవారితో పాటు మరో నలుగురిని మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేయించాలని సూచించారు. కార్యాలయంలో నామినేషన్ పేపర్ అందించడానికి, ఓటు వివరాలు తెలుసుకోవడానికి ఓటరు ఫెసిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆర్నకొండ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. చెక్‌పోస్ట్‌లో రోజు వారీగా చేస్తున్న తనిఖీల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల దృష్ట్యా అక్రమంగా మద్యం, డబ్బులు రవాణా చేసే అవకాశాలున్నాయని, రూ.50వేల కంటే ఎక్కువ నగదు ఉంటే ఎన్నికల నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకొని సీజ్ చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్, సీఐ రవీందర్, తహసీల్దార్ నరేందర్ తదితరులు ఉన్నారు.

# కనుల పండువగా యజ్ఞవరాహస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కమాన్‌చౌరస్తా, నవంబరు 1: జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహస్వామి ఆలయంలో 37వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సుప్రభాతం, కొలువు, తోమాలసేవ అనంతరం మోహినీ ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేక అలంకృత వేదికపై వివిధ ప్రాంతాల వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వసుధాలక్ష్మీ యజ్ఞవరాహస్వామి, రమా సత్యనారాయణస్వామి కల్యాణం వైభవోపేతంగా జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, లడ్డూతో పాటు మహాప్రసాద వితరణ చేశారు. సాయంత్రం వివిధ ప్రాంతాల చతుర్వేద పండితులకు దాతల సౌజన్యంతో ట్రస్టు తరపున ధర్మనిధి పురస్కారాలను అందజేశారు. రాత్రి గరుడ వాహనంపై శ్రీవారు ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వ వైదిక సంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 1: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కిమ్స్ కళాశాలలో పరీక్షకు హాజరైన వారు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు వివరించారు.

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



మొగ్దుంపూర్‌లో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న గంగుల కమలాకర్ సతీమణి రజిత

కరీంనగర్ రూరల్, నవంబర్ 1: గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత కోరారు. బుధవారం ఆమె మండలంలోని మొగ్దుంపూర్ గ్రామంలో మహిళలతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలకు బొట్టు పెట్టి ఓటు అభ్యర్థించారు. సర్పంచ్ జక్కం నర్సయ్య, గంగుల సుధాకర్, గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు, ఎంపీటీసీ పుష్ప, కరీంనగర్ ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో డైరెక్టర్ కందుల రమేశ్, దాడి లచ్చయ్య, బల్మూరి జగన్‌మోహన్‌రావు, కాసబోయిన భూమయ్య, అశోక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సంకష్టహర చతుర్థి పూజలు

కరీంనగర్ రూరల్, నవంబర్ 1: నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో లక్ష్మీగణపతికి ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు పవన కృష్ణ శర్మ విశేష అభిషేకం, ఫల పంచామృతాభిషేకం, విశేష హారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు